క్లుప్తంగా

సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం



తామరంలో కరపత్రం ఇస్తున్న హరిబాబు

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తామరంలో ఆయన శనివారం పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి గెలుపునకు కూడా ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు.

భక్తాంజనేయుడికి విశేష పూజలు



పూజలు చేస్తున్న ఎస్‌ఐ తదితర్లు

రావికమతం: కొత్తకోట భక్తాంజనేయ స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి తమల పాకు, సింధూర పూజలు నిర్వహిస్తామని, ఆరోజు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కవగుంటలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం



మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

రావికమతం: కవగుంటలో లోవోల్టేజీ సమస్య శనివారం పరిష్కారమైంది. ఇక్కడ కొన్నాళ్లుగా వేధిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఏఈ నందన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పలు ఇళ్ల మీదుగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసే పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ఏఈ ఈ సందర్భంగా తెలిపారు.

నేటి నుంచి చిన్నారుల ఆధార్ నమోదు

రోలుగుంట: స్థానిక మీ సేవా కేంద్రంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో చిన్నారులకు ఉచిత ఆధార్ నమోదు శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆధార్ నమోదుకు పుట్టిన తేదీ ధ్రువపత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9640119119, 9666600404 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నర్సీపట్నం వాసికి అరుదైన చికిత్స

మహారాణిపేట: గుండెకు సంబంధించిన అరుదైన చికిత్సను అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. నర్సీపట్నానికి చెందిన పెట్ల అప్పలనాయుడు (65) బృహద్ధమని కవాటం (వాల్వ్) పూడుకుపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రమాదకర స్థితిలో ఉన్న పేషెంట్‌కు అను వైద్యులు వాల్వ్ మార్పిడి ఆపరేషన్ నిర్వహించి, ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఈ అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించిన కార్డియాలజిస్టులు నాగేశ్వరరావు, పాల్ కిరణ్, శివదయాల్, సంతోష్‌కుమార్‌ల బృందాన్ని హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- ధర్మసాగరం జగనన్న లేఅవుట్‌ను పరిశీలించిన ఆర్డీవో జయరాం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం



జగన్న కాలనీలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి



మర్రిపాలెంలో నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

నర్సీపట్నం: లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం సూచించారు. ధర్మసాగరం జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. వీటి గురించి హౌసింగ్ అధికారులు, సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే లబ్ధిదారులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. బిల్లులు, నీటి వసతి సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ అన్నాజీరావు, హౌసింగ్ డీఈ ఫణి, ఏఈ నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలకు చర్యలు

కె.కోటపాడు: వచ్చే నెల ఉగాది కల్లా జగనన్న లేఅవుట్లలో 266 మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునేలా నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఎంపీడీవో శచీదేవి అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఇప్పటికే 160 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరో 106 ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మర్రివలస లేఅవుట్‌లో నిర్మాణాలను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ రవిబాబు, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, శ్వేత, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించి ఇళ్ల నిర్మాణాలు

నాతవరం: ఉగాదికి శత శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో మర్రిపాలెం, నాతవరం గ్రామ పంచాయతీల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండలంలో 56 జగనన్న లేఅవుట్లలో 2,030 మంది ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉగాదికి 313 ఇళ్లు పూర్తి చేసేందుకు దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం 185 ఇళ్లు పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలంలో ఎవ్వరికీ ఇల్లు మంజూరు కాలేదన్న మాట రాకూడదన్నారు. హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంటు బి. నాయుడు, పంచాయతీ కార్యదర్శి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

మాకవరపాలెం: జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో అరుణశ్రీ సూచించారు. మాకవరపాలెం జగనన్న కాలనీని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల్లో మంజూరైన గృహాలు, ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించిన వాటి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అబ్ధిదారులతో మాట్లాడారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. బిల్లులను సకాలంలో అందిస్తున్నట్టు చెప్పారు. హౌసింగ్ జేఈ రామలింగస్వామి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వేగవంతంగా నిర్మాణాలు..

మాడుగుల: కింతలి వల్లాపురం జగనన్న కాలనీలో 80 ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో మీనాకుమారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాంబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ లెక్కల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే అన్నదానం మిన్న

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ఉమామహేశ్వరీ దేవి (దేవీతల్లి) ఆలయం వద్ద శనివారం ఆయన అన్నసమారాధనను ప్రారంభించారు. దేవీతల్లి కల్యాణ తీర్థం తర్వాత ఏటా మాదిరిగా ఆలయ ఆవరణలో అన్నసమాధారన ఏర్పాటు చేశారు. అంతకు ముందు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుతో కలిసి దేవితల్లిని దర్శించుకున్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, దీవి శంకర్, వాలేటి నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలను పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాలలో అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు భరోసా ఇచ్చారు. పబ్లిక్ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. తద్వారా చదువుకున్న కళాశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ విజయ, హైస్కూల్ హెచ్‌ఎం బి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు



ఎం.కె.పట్నంలో టీకాలు వేస్తున్న పశు వైద్య సహాయకులు

రోలుగుంట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రోలుగుంట, బుచ్చింపేట, కుసుర్లపూడి పశు వైద్యులు నూకేశ్వర్రావు, అశ్విని, సురేష్ తమ పరిధి గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుచ్చింపేట పశు వైద్యురాలు అశ్విని శనివారం ఎంకె.పట్నంలో 220 గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 15 వేల గొర్రెలు, మేకలకు లక్ష్యంగా పెట్టుకోగా, ఇంతవరకు 9,450 జీవాలకు టీకాలు వేశామన్నారు. ప్రతి పెంపకందారుడు గ్రామ సచివాలయంలోగానీ, పశు వైద్య కేంద్రానికి గానీ వెళ్లి జీవాలకు ట్యాగ్‌లు, టీకాలు వేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు

దేవరాపల్లి: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని తెనుగుపూడి డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ పోటీలను ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను పర్యవేక్షించారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 18 గురుకుల విద్యాలయాల్లో ఈ పోటీలను నిర్వహించి అంబేడ్కర్ జయంతి రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పూర్వ విద్యార్థులు కైలాసం, కంచిమాల అప్పారావు, చైతన్య తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో ఈ పోటీలను త్వరలో నిర్వహిస్తామన్నారు.

నియోజకవర్గ స్థాయి సమీక్ష వాయిదా

కె.కోటపాడు/మాడుగుల: కె.కోటపాడులో ఆదివారం నిర్వహించాల్సిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం వాయిదా పడినట్లు వైఎస్సార్‌సీపీ మాడుగుల, కె.కోటపాడు మండలాధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు తదుపరి సమావేశం నిర్వహించే తేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి



తోటలో పని చేస్తున్న వేతనదారులు

నాతవరం: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తామని ఏపీవో చిన్నారావు తెలిపారు. శనివారం ఆయన ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో 15 వేలకుపైగా జాబ్‌కార్డులు ఉన్నాయని, వాటిలో 13,200 మంది మాత్రమే పనులకు వస్తున్నారన్నారు. శత శాతం పనులు కల్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం రోజు ఒక్కంటికి మండలంలో 4,320 మంది పని చేస్తుండగా, ఈ నెలలో 7 వేలకుపైగా కూలీలకు పని కల్పించాలన్నారు. ఈ నెలలో సోషల్ ఆడిట్ పూర్తయ్యాక వచ్చే నెల నుంచి జాబ్‌కార్డుదారులందరికీ పని కల్పిస్తామన్నారు. రైతుల అభీష్టం మేరకు పనులు చేస్తామని తెలిపారు.

రైతు విభాగం జిల్లా అధ్యక్షుడికి సత్కారం



దుశ్శాలువాలతో సత్కరిస్తున్న నేతలు

చీడికాడ: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన యర్రా అప్పారావును శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు మాట్లాడుతూ పార్టీ ఉన్నతి కోసం కృషి చేసే వారికి గుర్తింపు లభిస్తుందనడానికి అప్పారావుకు పదవి రావడమే నిదర్శనమన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకుగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, రైతు విభాగం మండలాధ్యక్షుడు పరవాడ నాయుడు, సీనియర్ నేతలు సుంకర శ్రీను, కురచా నారాయణమూర్తి, చుక్కా అప్పలనాయుడు, పరవాడ మహేష్, ఎస్.మహేష్, కె.రామకృష్ణ, ఓ.డి.నాయుడు, సకలా రమణ, పి.ఈశ్వరరావు, పి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

వాహన రికార్డులు లేకుంటే కేసులు



వాహనాల తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

మాకవరపాలెం: రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు తప్పవని నర్సీపట్నం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.ఆర్.మూర్తి హెచ్చరించారు. మండల కేంద్రంలోని విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారిలో శనివారం ఆయన విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. రహదారి నిబంధనలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నర్సీపట్నం/చోడవరం: విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా ఆదివారం పెదబొడ్డేపల్లి విద్యుత్ శాఖ కార్యాలయంలో బిల్లు కౌంటర్ తెరిచి ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు శనివారం తెలిపారు. చోడవరం, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాల్లో విద్యుత్ బిల్లులు కట్టించుకునే కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయన్నారు. వినియోగదారులు గడువులోగా బిల్లులు చెల్లించకపోతే సర్‌చార్జీలు కలిపి అదనంగా కట్టాల్సిన ఉంటుందన్నారు. ఈ నెల 28 రోజులే ఉండటం వల్ల వినియోగదారుల సౌలభ్యం కోసం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు విద్యుత్ బిల్లు కౌంటర్లు పని చేస్తాయన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థులు రైవాడ జలాశయం సందర్శన



జలాశయం వద్ద అగ్రికల్చర్ విద్యార్థులు, అధ్యాపకులు

దేవరాపల్లి: విశాఖ నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా రైవాడ జలాశయాన్ని శనివారం సందర్శించారు. డి. తేజస్విని, కె. చరిష్మా, ఎల్. ప్రవీణ్‌కుమార్ తదితర అధ్యాపక బృందం పర్యవేక్షణలో 34 మంది బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఇక్కడ రైవాడ జలాశయం అతిథి గృహాన్ని సందర్శించారు. అనంతరం రైవాడ జలాశయం, స్పిల్‌వే గేట్లు, కుడి, ఎడమ ప్రధాన కాలువలు, జీవీఎంసీకి నీరందించే కాలువలను పరిశీలించారు. 15,344 ఎకరాల ఆయకట్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల నుంచి సాగునీరుతోపాటు జీవీఎంసీకి తాగునీరు అందిస్తుందని జలాశయం పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులు గణపతి, అరుణ సమగ్రంగా వివరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సర్పంచ్

దేవరాపల్లి: జగనన్న గోరు ముద్ద పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ సూచించారు. ఏ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలను శనివారం ఆయన పరిశీలించారు. భోజనం రుచి చూశారు. హెచ్‌ఎం స్వర్ణలత ఉన్నారు.

కోలా గురువులుకు అభినందన



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన రాష్ట్ర మత్స్యకార సొసైటీ చైర్మన్ కోలా గురువులును అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- దేవరాపల్లి/చోడవరం

సాగు పట్టాలు అందించాలని వినతి



సాగు పట్టాలు అందించాలని కోరుతున్న చిట్టియ్యపాలెం దళితులు

బుచ్చెయ్యపేట: పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న డీ- ఫారం భూములకు పట్టాలు అందించి ఆదుకోవాలని చిట్టియ్యపాలెం దళితులు కోరుతున్నారు. తమ గ్రామానికి ఆనుకున్న రాజాం రెవెన్యూలో సర్వే నంబర్ 233లో ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. సదరు భూముల్లో నీలగిరి, జీడిమామిడి తదితర తోటలు సాగు చేసుకుంటున్నా, పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు వర్తించడం లేదని వాపోయారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు అందించాలని గ్రామానికి చెందిన ముత్యాల అర్జునమ్మ, మంగ, బొర్రా నూకరత్నం, కోరుబిల్లి లోవ, నాగులాపల్లి మణి, ఎత్తుల తలుపులమ్మ తదితర్లు కోరుతున్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం: పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల్లో రాణించాలని పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాలు తెలిపారు. శనివారం చెట్టుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.రాఘవనాయుడు మాట్లాడుతూ పది పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు గజాల సూరిబాబు, ఇన్నం రమణ, ఎర్రంశెట్టి పాపారావు, చక్రవర్తి పాల్గొన్నారు.

ఏకశిలా ధ్వజస్తంభం పనులు ప్రారంభం

మాడుగుల: స్థానిక గవర వీధిలోని వైభోగ సీతారాముల ఆలయంలో ఏకశిలా ధ్వజస్తంభం ప్రారంభ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల ఒకటో తేదీన దీని ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు భీమరశెట్టి గంగాధర్, అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ తెలిపారు.

అనర్హులకే ఇళ్ల స్థలాల పంపిణీ అవాస్తవం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలో అర్హులకే ఇళ్ల స్థలాలు అందించామని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. జగనన్న కాలనీల్లో అనర్హులకు ఇళ్ల స్థలాలు అందించారని ఇటీవల జెడ్పీ సమావేశంలో కొంత మంది సభ్యులు లేవదీయడాన్ని ఖండించారు. శనివారం బుచ్చెయ్యపేటలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు అందించామన్నారు. 35 గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాలు అర్హులకే అందించగా, నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆశయాల మేరకు పార్టీ మండల నాయకులు నడుచుకోవాలని, ఎక్కడైనా తప్పిదాలు ఉంటే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకురావాలన్నారు. వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షులు మరిసా నాని, దేవర అప్పారావు, జిల్లా, మండల యాదవ సంఘం నాయకులు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, కాపు సంఘం మండలాధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బర్ల శివ, గొలజాన శ్రీను, గోకివాడ వరకృష్ణ, రాము, గంట్ల అప్పలనాయుడు, యర్రంశెట్టి రామారావు, సుంకరి శ్రీను, అర్జున అప్పారావు, రాజు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి గర్హనీయం



ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చోడవరం రూరల్: మండలంలోని సచివాలయ ఉద్యోగులు శనివారం చోడవరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సతీష్‌పై గ్రామానికి చెందిన యలమంచిలి పోతినాయుడు దాడి చేశాడని ఎస్‌ఐ బి.అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి సీఐటీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, నాయకుడు ఎస్.వి.నాయుడు, ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు, తదితరులు మద్దతు పలికారు. రాజకీయ అండదండలతో ఇలా బరితెగించడం తగదన్నారు. దీనిపై విచారణ చేపట్టి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ బి.శ్రీనివాసరావు హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు.